# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 128 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

19-03-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


# దివ్యాంగులకు ఫ్రీ బస్

- దివ్యాంగ శక్తి పథకంతో రాష్ట్రంలో 12.70 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి
- జిల్లాలో 42 వేల మంది దివ్యాంగులకు లబ్ధి
- దివ్యాంగులకు జిల్లాలో ఉన్న బస్టాండ్‌ల వద్ద బస్ పాస్ జారీ చేసే కౌంటర్లు ఏర్పాటు
- రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు దివ్యాంగులకు ఉచిత బస్సు
- రాష్ట్రంలో గ్యాస్ సమస్య లేదు
- రాగోలులో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన
- రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నవతరం -శ్రీకాకుళం**

రాష్ట్రంలో 12.70 లక్షల మంది దివ్యాంగులు దివ్యాంగ శక్తి పథకాన్ని(ఉచిత బస్సు ప్రయాణం) వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో కలసి శ్రీకాకుళం నియోజకవర్గం రాగోలులో దివ్యాంగ శక్తి పథకానికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రాగోలు నుండి శ్రీకాకుళం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ దివ్వాంగునితో మంత్రి మాట్లాడుతూ పెన్షన్ ఎంత వస్తుంది, భార్య, బిడ్డలు ఎలా ఉన్నారు అమ్మా, నాన్న బాగున్నారా, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీకాకుళం ఆర్టీసి డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఉచిత బస్సు ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గుంటూరులో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద 175 నియోజక వర్గాలలో దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగ సోదరులకు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విడదీయరాని బంధమని గుర్తుచేశారు. ఫించను రెండు వందల నుండి పెంపు చేస్తూ 4 వేలు, వారికున్న శాతాన్ని బట్టి ఫించన్లు ఉంటాయన్నారు. దివ్యాంగులను ఆదుకునేది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబేనన్నారు. వికలాంగులకు సమాజంలో గౌరవం, గుర్తింపు తీసుకువచ్చేది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని చెప్పారు. ఎన్నికల ఉన్న మేనిఫెస్టే కాకుండా మేనిఫెస్టో లో లేని ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే స్త్రీ శక్తి పథకం సూపర్ హిట్ అయ్యిందన్నారు. డిశంబరు నెలలో దివ్యాంగ శక్తి పథకం ముఖ్యమంత్రి కి ఆలోచన వస్తే మార్చి నెలలోనే అమలు చేసినట్లు పేర్కొన్నారు. 12.70 లక్షల మంది దివ్యాంగుల వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రెండు లక్షల మంది మాత్రమే బస్సు పాసులు తీసుకున్నారు. దివ్యాంగ శక్తి పథకంతో అందరూ బస్సు పాస్ తీసుకోవచ్చన్నారు. జిల్లాలో 42 వేల మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. జిల్లాలో 3400 మంది బస్సు పాస్ లు తీసుకున్నట్లు చెప్పారు. గతంలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి, డివిజన్ ల్లోనే బస్ పాస్ లు జారీ చేసే వారని, ఎక్కడైతో బస్టాండ్ లు ఉన్నాయో అన్ని బస్టాండ్లు వద్ద దివ్యాంగ శక్తి పథకంనకు సంబంధించి బస్సు పాస్ కౌంటర్లు ఏర్పాటు చేసి పాసులు జారీ చేస్తామన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు... ఆంధ్రప్రదేశ్ లో ఏ ప్రాంతానికైనా ఉచిత ప్రయాణం చేయవచ్చునన్నారు. పథకాల అమలుకు అందరూ సహకరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజిఎస్ ద్వారా పథకాల అమలు విషయం తెలుసు కుంటున్నారని, పథకాల అమలులో సమస్యలు ఉంటే ముఖ్యమంత్రికి తెలియజేసుకునే అవకాశం ఉందన్నారు. ఇచ్చిన హామీలే కాదు ఇవ్వని హామీలు అమల్లోనూ సూపర్ హిట్ అయ్యిందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని ఆరా తీసి ఆర్టీసీ కాంప్లెక్స్ ల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయుట, మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ఆర్టీసీ ఎండికీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడమైనదని, ఇటీవల విజయవాడలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులోనూ ఆర్టీసీ కాంప్లెక్స్ ల్లో మౌలిక సదుపాయాలు పై పర్యవేక్షణ చేసే విధంగా కలెక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందనలు తెలియజేశారు. దివ్యాంగ శక్తి పథకాన్ని దివ్యాంగలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం వలన ఎల్ పి జి గ్యాస్ సమస్య రాష్ట్రంలో లేదన్నారు. మహిళలకు గ్యాస్ సమస్య ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మూడు విడతల్లో రైతులకు నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పింఛన్ల వారీగ చూస్తే జిల్లాలో 32 వేల మంది ఫింఛన్లు తీసుకుంటున్నారన్నారు. ఆర్టీసి వద్ద ఫ్రీ బస్సు పాసు తీసుకోవాలని దివ్యాంగులను కోరారు. జిల్లాలో పాసులు జారీకి ఏర్పాటు చేసిన కౌంటర్లు వద్ద తీసుకోవాలన్నారు. కొంత మంది దివ్వాంగులు బస్సులు ఎక్కలేకపోతున్నారని వారి కోసం ర్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ శుక్రవారం స్వాభిమాన్ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదని, వారికి ఉద్యోగ, ఉపాధి సమస్యలు, ట్రై బ్యాటరీ సైకిల్, తదితర సమస్యలు పరిష్కారం జరుగుతోందన్నారు.

స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంద్రధనస్సు కార్యక్రమం ప్రకటించినట్లు గుర్తు చేశారు. దివ్యాంగులకు ఫింఛన్లు, దివ్వాంగుల కోసం స్వాభిమాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ద్వారా దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగ శక్తి పథకాన్ని దివ్యాంగులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ మాట్లాడుతూ శత శాతం వైకల్యం ఉన్న వారికి అటెండెంట్లుకు రాయితీ ఉంటుందన్నారు. నాన్ స్టాప్, ఎసి బస్సుల్లో రాయితీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్టక్చర్ కార్పోరేషన్ డైరెక్టర్ పిఎంజె బాబు, జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్. అప్పలనారాయణ, డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, దివ్యాంగుల శాఖ ఎడి బి. శైలజ, పిఆర్ఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు




3లో


# బ్లష్ ఏంజెల్స్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



**నవతరం -శ్రీకాకుళం**

బ్లష్ ఏంజెల్స్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. నగరంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న ఖుషీబ్యూటీక్లబ్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు, బ్యూటీషియన్లు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంప్రదాయ వాతావరణంలో నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఖుషీబ్యూటీక్లబ్ నిర్వాహకులు పడపాన సుగుణారెడ్డి, ప్రియ, మాధురి, రమ మాట్లాడుతూ ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళలలో ఐక్యతను పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యూటీషియన్లు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన పోరాటమే అసలైన పండుగ ధర్మాన కృష్ణదాస్



**నవతరం -నరసన్నపేట**

రాష్ట్ర ప్రజలకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో ప్రజల గొంతుకగా నిలవడమే తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. జగనన్న వెంటే మా ప్రయాణం: "అధికారం ఉన్నా లేకపోయినా మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి వెంటే మా ప్రయాణం. -మిగతా 2లో

# ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యం! ఎమ్మెల్యే ఆదేశాలతో లోడగల ఆకస్మిక తనిఖీ



**నవతరం -పలాస**

"పేదవాడి ఆకలి కేక వినకూడదు" అనే స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి మహోన్నత ఆశయానికి, "ప్రతి పేదవాడి కడుపు నింపాలి" అనే శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సంకల్పానికి ప్రతిరూపం అన్నా క్యాంటీన్లు అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ లోడగల కామేశ్వరరావు గారు కొనియాడారు. కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిలిచిందని ఆయన అన్నారు. పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి గౌతు శిరీష గారి ఆదేశాల మేరకు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్నా క్యాంటీన్‌ను ఆయన ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్ నిర్వహణను, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. వంటశాలను, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం, అక్కడ భోజనం చేస్తున్న పేదలతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. "కేవలం 5 రూపాయలకే ఇంత మంచి భోజనం దొరకడం మా అదృష్టం సార్. ఇక్కడ అన్నం చాలా రుచిగా, శుభ్రంగా ఉంటుంది" అని వారు ఆనందం వ్యక్తం చేయగా, కామేశ్వరరావు గారు భావోద్వేగానికి గురయ్యారు.

అనంతరం శ్రీ కామేశ్వరరావు గారు మాట్లాడుతూ, "ఎమ్మెల్యే గౌతు శిరీష గారి ఆదేశాలతో ఈ రోజు ఇక్కడికి వచ్చాను. గత ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా మూసివేసిన ఈ క్యాంటీన్లను, మా ప్రభుత్వం తిరిగి ప్రారంభించి పేదలకు అండగా నిలిచింది. స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా, చంద్రబాబు నాయుడు గారి పాలనలో ప్రతి పేదవాడి ఆకలి తీర్చడమే మా ప్రభుత్వ ధ్యేయం. కేవలం 5 రూపాయలకే ఇంత శుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడం మా ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నాం," అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో 27వ వార్డు మాజీ కౌన్సిలర్ గురుటి సూర్యనారాయణ రావు గారు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సవర రాంబాబు గారు, లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి గారు, బద్రి గోపాల్ రావు గారు, మరియు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# మాదకాసురులు!

'అణిచేస్తాం...
కోరలు పీకేస్తాం..'
రాష్ట్రాన్ని గుల్లచేస్తున్న
మాదక ద్రవ్యాల
మాఫియా పేరెత్తగానే నాయకుల నోటివెంట అలవోకగా వెలువడే భీషణ ప్రతిజ్ఞలివి! మాదకాసురులపై ఉక్కుపాదం మోపుతామనే ప్రభుత్వాల మాటలు కొన్నేళ్లుగా కోట దాటుతున్నా, చేతలే గడప కూడా దాటడం లేదు. కొందరు బడా బాబులు.. నగర శివారులను డ్రగ్స్ పార్టీలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఫామ్‌హౌసుల్లో పార్టీలు చేసుకుంటూ మత్తులో తూగుతున్నారు. చట్టాలు చేసి వాటి అమలుకు బాధ్యతగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులే ఈ పార్టీల్లో దోషులుగా పట్టుబడుతూ సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి జరిగిన డ్రగ్స్ పార్టీ రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తోంది.

నిందితుల్లో పైలట్ రోహిత్ రెడ్డి, ఏపి టీడీపీ ఎంపీ పుట్ట మహేష్ కుమార్, రాజస్తాన్ మాజీ ఎమ్మెల్యే నితీశ్ శర్మలు ఉండటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. మాదక ముఠాలకు మహారాజుల వంటివారి జోలికి సర్కారీ యంత్రాంగం పెద్దగా పోదు. కానీ, 'అడవిపంది చేను మేసిపోతే.. ఊరపంది చెవులు కోసినట్లు' చిల్లర నేరగాళ్లపై మాత్రం తన ప్రతాపమంతా చూపిస్తుంటుంది. డ్రగ్స్ కేసుల్లో శిక్షల శాతం చాలా స్వల్పంగా ఉందని, అరెస్టు అవుతున్న వారిలో అత్యధికులు చిన్నచిన్న సరఫరాదారులు, వినియోగ దారులేనని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. యువతను నిర్వీర్యం చేస్తూ రక్తపుకూడుతో విందులు చేసుకునే ఇటువంటి నేరగాళ్లకు చైనా, ఇండొనేసియా వంటి 35 దేశాల్లో శిక్షలను కఠినంగా అమలు చేస్తున్నారు. తద్భిన్నంగా మన దేశంలో నెలకొన్న పరిస్థితి దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అందుకు అనేక ఉదాహరణలున్నాయి. తాజా కేసులో ఈగల్ టీం, ఎస్ఓటీ పోలీసులు ఫాంహౌస్‌లోకి వెళ్తున్న క్రమంలో సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులను అడ్డుకుని హంగామా సృష్టించారు. తుపాకీతో గాలిలోకి నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో పదకొండుమందిపై కేసు నమోదు కాగా, కేవలం ముగ్గురుని మాత్రమే రిమాండ్‌కు తరలించారు. ఒకవైపు పార్లమెంట్ జరుగుతుంటే సదరు ఎంపీ కొకైన్‌తో చిందులు వేయడం ఎంతటి బాధ్యతారాహిత్యం. ఇలాంటి వారు ప్రజాప్రతి నిధులు అని చెప్పుకోవడానికి ప్రజలు సిగ్గుపడుతున్నారు. అయినా ప్రభుత్వాలు వారికి కొమ్ముకాస్తున్నాయి. ఇదే ఘటనలో తెలంగాణకు చెందిన మరో 'బడానేత' కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అతన్ని తప్పించేందుకే కాల్పులకు పాల్పడ్డారన్న వార్తల్లో నిజం ఎంతో పోలీసుల దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.

సాధారణ నేరాల్లోనే... అసలు తప్పు చేశారో లేదో తెలియకుండానే విచారణ ఖైదీలు కోకొల్లలుగా కటకటాల్లో జీవచ్ఛవాలవుతున్నారు. తమ వికృత వ్యాపారానికి ప్రజారోగ్యాన్ని బలిపెట్టే పెద్దమనుషులు మాత్రం చట్టం చేతుల్లోంచి ఇసుక రేణువుల్లా జారిపోతున్నారు! సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంచేసినట్టు సామాజిక శ్రేయస్సుకు అత్యంత ప్రమాదకారులైన డ్రగ్స్ దందాసురులు ఎటువంటి కనికరానికీ అర్హులు కారు. గట్టి నిఘా, సమర్థ పర్యవేక్షణ లోపభూయిష్టమైతే నేర ముఠాల విధ్వంసకర కార్యకలాపాలకు పట్టపగ్గాలు లేకుండా పోతాయనడానికి ఈ సమకాలీన ఘటనలే నిలువెత్తు రుజువు. దేశీయంగా గంజాయి సాగు, వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతుంటే... హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలు వెలు పలినుంచి జల, వాయు మార్గాల్లో వచ్చిపడుతున్నాయి. 8-12 తరగతుల విద్యార్థుల్లో పది శాతానికి పైగా మద్యం, పొగాకు, గంజాయి, నల్లమందులకు అలవాటుపడ్డారని ఎయిమ్స్ వైద్య నిపుణుల బృందం తమ అధ్యయనంలో నిగ్గుతేల్చింది. దేశ భవిష్యత్తుకు వెలుగుదీపాలు కావాల్సిన చిన్నారులు, యువతను ఒంటి మీద స్పృహ ఉండని వ్యసనపరులుగా తయారు చేస్తున్నాయవి. అంతేకాదు, వాళ్లలో ఎంతోమందిని కరడుగట్టిన నేరగాళ్లుగానూ మార్చేస్తున్నాయి. గంజాయి బ్యాచ్ ఆగడాలతో తరచూ నేరాలు చోటుచేసుకుంటున్నాయన్న స్థానికుల మొత్తుకోళ్లు అరణ్యరోదనలే అవుతున్నాయి.

పాఠశాలలకూ పాకిన మాదక జాడ్యాన్ని పరిమార్చాలంటే కేంద్ర, రాష్ట్ర సంస్థల నడుమ సమన్వయం, వాటికి సరైన సాధన సంపత్తి ప్రాణావసరాలు. వాటికి ప్రోదిచేస్తూ, మాదక మహాసామ్రాజ్యాలకు మకుటం లేని చక్రవర్తులైన వాళ్లందరినీ బోనెక్కించేందుకు పాలకులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో నడుం బిగించాలి. అప్పుడే సామాజిక పునాదులను కూల్చేస్తున్న ఈ మహావిధ్వంసాన్ని నిలువరించడం సాధ్యం! ఈగల్, ఎన్‌సీబీ, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ విభాగాలు సమష్టిగా కదం తొక్కేలా కేంద్రం, రాష్ట్రాలు మాదకాసురులపై ఉమ్మడిగా కదనభేరి మోగించాలి. లేదంటే మత్తులో చిత్తు అయిన 'యువత'తో రాష్ట్రం నిర్వీర్యమైపోయే ప్రమాదం పొంచి ఉంది... తస్మాత్ జాగ్రత్త!

## ప్రజల పక్షాన పోరాటమే అసలైన పండుగ: ధర్మాన కృష్ణదాస్

మొదటిపేజీ తరువాయి
కష్టకాలంలో ప్రజలకు అండగా నిలబడటం ఆయన నేర్పిన పాఠం. ఈ నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ముఖ్యంగా రైతాంగం, అణగారిన వర్గాల సమస్యలు తీరాలని కోరుకుంటున్నాను" అని కృష్ణదాస్ పేర్కొన్నారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలకు సంకేతమని, రాబోయే రోజుల్లో ప్రతిపక్షంగా ప్రజల హక్కుల కోసం మరింత రాజీలేని పోరాటం చేస్తామని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండి, జగనన్న ఆశయాల సాధనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



**నవతరం - ఎచ్చెర్ల**
రాష్ట్రవ్యాప్తంగా నేడు ప్రారంభమైన 'దివ్యాంగ శక్తి' పథకం ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుభద్రపురం జంక్షన్ వద్ద జెండా ఊపి ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు. తదుపరి బస్సు ను ఎచ్చెర్ల ఎంపీడీఓ ఆఫీస్ వరకు డ్రైవ్ చేసారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు ఈ పథకం ద్వారా దివ్యాంగ సోదర సోదరీమణులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, అలాగే వారి సహాయకులకు 50% టిక్కెట్ రాయితీ కల్పించడం జరిగింది. మన నియోజకవర్గంలోని దివ్యాంగులందరూ ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. తదుపరి దివ్యాంగ సోదర సోదరీమణులతో కలిసి భోజనం చేసారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ ఆఫీసర్ పొగిరి సుగుణకరరావు,డాక్టర్ విశ్వక్సెన్, చౌదరి బాబ్జి, చౌదరి అవినాష్, అన్నెపు భువనేశ్వరావు, బెందు మల్లేశ్వరరావు,ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, గాలి రెడ్డి, పైడి నూకరాజు,వావిలాపల్లి రామకృష్ణ,సంపతరావు నాగేశ్వరరావు, సనపల రామారావు, పిసిని జగన్నాధం నాయుడు,లంక ప్రభాకర్,గురు అబ్బు, మండపాక కనకారావు,మజ్జి రామ్మూర్తి, అమూజూరు శివాజి తదితరులు పాల్గొన్నారు.

# శిశిర వసంత శోభ.... శ్రీ పరాభవ నామ ఉగాది



భారతీయ కాలగణనం మూడు విధాలుగా చేయగా సౌరమానం, చాంద్ర మానం, బార్హస్పత్యమానంగా, సౌరమానం సూర్యుని ఉదయాస్తమయ కాలాలను ఆధారంగా చేసుకుని నిర్ణయించేది. చంద్రుని ఉదయాస్తమయ కాలాలు, వృద్ధి క్షయాలు ఆధారంగా చేసే కాల నిర్ణయం చంద్రమానమైంది. బృహస్పతి (గురు) గ్రహం చలన ఆధారంగా చేసే గణనమే బార్హస్పత్యమానం. చాంద్రమానం ప్రకారం చైత్రశుద్ధ పాడ్యమినాడు ఆ సంవత్సరంలో మొదటి దినం. యుగస్య ఆది: యుగాది. యుగం యొక్క ప్రారంభం అని దీని అర్థం. ఉగాది అంటే 'ఉ' అంటే నక్షత్రం 'గ' అంటే గమనం. నక్షత్ర గమనానికి 'ఆది' కనుక ఉగాదిగా పిలుస్తారు. సంవత్సరాది, యుగాది, ఉగాది, ఈరీతిగా అనేక పేర్లతో రూఢ్యమై అనేక సాంప్రదాయాల ద్వారా తెలుగువారికి కర్తవ్యాలను చక్కగా నిర్దేశించి చెప్పే తొలి పర్వదినం ఉగాది.

ఏ ఋతువైనా సుఖప్రదమైన, ఆనందదాయకమైనదే. మానవ జీవితము వివసితమై వసంతంలోని విశిష్టత ప్రకృతి విలాసంలో ప్రతిఫలిస్తుంది. ప్రకృతికాంత షడ్రునాలే ఆరు ఋతువులుగా ఒక్కొక్క ఋతువు ఒక్కొక్క మనఃప్రవృత్తిని వికసింపచేసి, మానవ జీవితంలో కష్టసుఖాలు తాత్కాలికాలు అని సూచిస్తాయి. ఋతువులు ప్రాచీన కాలం నుండి మానవ జీవితంలో ఆనంద ఉత్సాహాలను పెంపొందిస్తున్నాయి. చైత్రశుద్ధ పాడ్యమినాడే నూతన సంవత్సరారంభమని మన పూర్వులు నిర్ణయించడానికి కారణం వసంత ఋతువులో ప్రకృతిలో నవచైతన్యం మోసులెత్తడమే. జ్యోతిష్య శాస్త్రవేత్త వరాహమిహిరుడు వసంతకాలంలోని చైత్రశుద్ధ పాడ్యమిగా నిర్ణయించడం అప్పటి నుండి చైత్ర శుద్ధ పాడ్యమినే 'ఉగాది'గా జరుపుకుంటున్నాము. ఇది శ్రీ పరాభవ నామ సంవత్సరం. పాదం మోపకముందే యుద్ధం మొదలైంది.

సృష్టికారకుడైన బ్రహ్మ, చైత్రమాస శుక్లపక్ష ప్రథమ దినమున సూర్యోదయ వేళ సమగ్రంగా ఈ జగత్తును సృజించడంతోపాటూ, కాలగమనంలో గ్రహ, నక్షత్ర, ఋతు, మాస, వర్షవారాధిపులను ప్రవర్తింపజేసినట్లు 'చతుర్వర్గ' చింతామణి వ్రత ఖండం పేర్కొంది. వసంత శోభ రమణీయంగా ఉండి భౌతిక సుభమే కాకుండా, ఆధ్యాత్మిక సుఖం కూడా లభించే ఉగాది పర్వదినాన అందరూ ఉదయాన్నే స్నానమాచరించి, పిల్లలు, పెద్దలు, నూతన వస్త్రాలను ధరిస్తారు. తమ తమ ఇష్టదైవాన్ని పూజిస్తారు.

ఉగాదినాడు ప్రత్యేకంగా వేపపూత, మామిడి కాయముక్కలు, కొత్తబెల్లం, కొత్త చింతపండు, చెరుకు ముక్కలు, మిరియపు పొడి, ఉప్పు మొదలైన మిశ్రమంతో, 'ఉగాది' పచ్చడి తయారు చేస్తారు. తీపి చేదుతో వగరుతో కూడిన ఈ ఉగాది పచ్చడిని మానవ జీవితంలో ఉండే సుఖదుఃఖాలకు ప్రతీకగా చెబుతారు. మన భారతీయ సంప్రదాయంలో ప్రతి పండుగ వెనుక ఆధ్యాత్మికపరమైన విషయాలతో, ఔషధ పరమైన ఆయుర్వేద రహస్యాలెన్నో దాగివుంటాయి. ఉగాది పచ్చడిలో ఉండే తీపి, పులుపు, కారం, వగరు,ఉప్పుదనం, లేదు అనే ఆరు రుచులు ఔషధపరంగా ఆలోచిస్తే అది వ్యాధినిరోధక శక్తి వస్తుందని ఆయుర్వేదం తెలియజేస్తుంది.

వేదిచెట్టుగాలి ఆరోగ్యానికి అభప్రదం. అలాగే వేప చిగుర్లు కడుపులోని మలిపురుగుల్ని చంపేసి, తిరిగి పుట్టనీయవు. వేప ఆకును పసుపు, నూనెలో కలిపి ముద్ద చేసి ఒంటికి రాసుకుంటే చర్మవ్యాధులు నయమవుతాయి. కొత్త బెల్లం ఆకలిని కలిగిస్తుంది. కొత్త చింతపండు కఫవాతాన్ని పోగొట్టగా, కారాన్ని కలిగించే మిరియపు పొడి శరీరంలోని క్రిముల్ని నాశనం చేస్తుంది. మామిడి ముక్కలు లాలాజలాన్ని ఊరించి జీర్ణక్రియకి తోడ్పడుతుంది. ఉప్పు ఎముకలని బలపరుస్తుంది. ఈ ఆరు రుచులు ఆరు ఋతువుల్లో మనకి కలిగే ఆరు రకాల దీర్ఘకాలిక వ్యాధుల్ని తొలగిస్తాయి. ఉగాదినాడు షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడిని అందరూ ఆరగించడం పంచ భక్ష్యాదులతో భోజనం ఆరోగ్యప్రదం. పంచాంగ శ్రవణం ఉగాది రోజున ప్రత్యేకతను సంతరించుకున్న అంశం.

తిరుమల తిరుపతి దేవస్థాన పంచాంగం. శ్రీశైల పంచాంగం. తెలంగాణలో చెన్నూరి పంచాంగం.. ఆంధ్రలో నేమాని పంచాంగం.. ఈ నాలుగు పంచాంగాలు పూర్వం ఉండేవి. ఇప్పుడు కూడా ఉన్నాయి. ఇవి పటిష్టమైన పంచాంగాలు. జ్యోతి శాస్త్రానికి భలిష్ఠమైనవి. ఈనాడు జిల్లాకో పంచాంగ కర్తలు కుక్క గొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ఇది ఆరోగ్యకరమైన విషయం కాదు. తమ ఇష్టానుసారం పంచాంగాలు ప్రచూరించుకుంటున్నారు. ఇది ఒక వ్యాపారమైంది. ఉగాది పండుగ ఆరు నెలలకు ముందుగానే ఈ పంచాంగాలు విడుదల చేస్తున్నారు. జ్యోతి శాస్త్రము పై పట్టు లేని వాళ్ళు ఎందరో ఉన్నారు. ఏది ఏమైనా శాస్త్రాన్ని వక్రదారి పట్టించరాదు. నిజాల్ని కప్పి పెట్టి రాజకీయ నాయకులకు అనుగుణంగా జాతకాలని చెప్పడం సరైన పద్ధతి కాదు శాస్త్రాన్ని నమ్మిన పంచాంగ కర్త నిజాన్ని నిక్కచ్చిగా చెప్పాలి. పూర్వపు పంచాంగ కర్తలను ఈనాటికీ మనం స్మరించుకోవడం శాస్త్రాన్ని విస్మరించకపోవడం. పంచాంగాల్లోని విషయాలను వక్రదారి పట్టించకుండా సరియైన మార్గము చూపేవారు. కనుక ప్రామాణికమైన పంచాంగాలను ఆదరిద్దాం.!

ఈ సంవత్సరం పరాభవమే ఐనా.. వై/భవమే అగును గాక

పంచాంగం భవిష్యత్తు గురించి సమాచారం అందించే గ్రంథం మాత్రమే కాదు, దీని వెనుక మతపరమైన ఆధ్యాత్మిక అర్థం ఉంది శ్రీమహావిష్ణువు కాలపురుషుడిని గౌరవించేందుకు పంచాంగ శ్రవణం చేస్తారు. భగవంతుని కాలాన్ని లేదా కాలపురుషుడిని ఆరాధించడం అంటే ఆయనకు నివాళులు అర్పించినట్లే. నిజానికి మన జీవితంలో సమయం యొక్క ప్రాముఖ్యతను పరిగణలోనికి తీసుకొని ప్రతిక్షణం చక్కగా జీవించాలి మన జీవితం ఎలా సాగుతుందో.. మనలో ఎవరికీ తెలియదు. ఆటుపోట్లు తిరుగులేనిది.ఎవరి కోసం వేచి ఉండవు. జీవితం అనేది పరిమితంగా ఉంటుంది. జీవితంలో సమయం ఎప్పుడూ విలువైనదే మన జీవితాలపై సమయ ప్రభావం ఉంది మనం ఎప్పటికీ తప్పించుకోలేము.మనిషి ఏదైనా చెడు కర్మ చేస్తే అతను ఆ ఫలితాన్ని అనుభవించాలి. కర్మ ఫలితాలను శాంతింప చేయడానికి ఆచార,ఆరాధన, విధులు, బాధ్యతల పంపిణీ ఉత్తమ మార్గం.కాలాన్ని కర్మ ఫలితాలను ఇచ్చే దైవాన్ని ప్రసన్నం చేసుకోవడానికి పంచాంగ శ్రవణం మనిషికి తోడ్పడుతుంది.

పంచాంగ శ్రవణం తిధిర్వారంచన నక్షత్రి యోగః కరనమేవచ !
పంచాంగ మితి విఖ్యాతాం లోకోయం కర్మసాధకః "అంటే తిధి, వార, నక్షత్ర, యోగ, కరణములను ఐదు అంగములు కలది. కలిగినది పంచాంగం. ఈ ఐదు అంగాలతో కూడిన పంచాంగాన్ని ఉగాది రోజున వివిధ దేవతలతోపాటు పూజించాలనే శాస్త్ర వచనం కాగా పంచాంగ శ్రవణాన్ని చేస్తున్న సమయంలో ఉత్తరాభిముఖంగా కూర్చొని పంచాంగం వింటే శుభ ఫలితాల్సి పొందుతారని పండితుల అభిప్రాయం. ఆ సంవత్సరంలో జరుగబోయే వివిధ ఫలితాలను, లాభనష్టాలను, సంఘటనలు, వర్షాలు, ప్రమాదాలు, తదితర వాటిని పంచాంగకర్తలు అంచనా వేస్తారు.

పంచాంగ శ్రవణంచే తిథి వలన సంపదను ప్రసాదిస్తుంది. వారం ఆయుష్షను పెంపొందింపచేస్తుంది. నక్షత్రం పాపాలను తొలగిస్తే యోగం వ్యాధులను నయం చేస్తుంది. కరణం కార్యాలను సిద్ధింపచేస్తుంది. ఈ ఐదు అంగములను తెలుసుకోవడం వల్ల గంగానదిలో స్నానం చేసిన ఫలితం అభిస్తుందని తెలుస్తోంది. పంచాంగ శ్రవణము చేసిన వారికి సూర్యుడు శౌర్యమును, చంద్రుడు, ఇంద్ర సమాన వైభవమును, కుజుడు, శుభమును, బుధుడు బుద్ధిని, గురువు గౌరవమును శుక్రుడు సుఖమును, శని ఐశ్వర్యమును, రాహువు. బాహుబలమును, కేతువు కులాధక్యమునుకలుగుతుందికనుక మానవ జన్మకు పరమ లక్ష్యమగు మోక్షప్రాప్తికి ఆధ్యాత్మిక జ్ఞానము అవసరముగాన సగుణ రూపములగు బ్రహ్మాండ, దేహ, దేవాలయాలకు ఏకత్వం సాధించి ఆధ్యాత్మిక జ్ఞానమును, బహిక, ఆముష్మిక భోగములను ముక్తిని పొందుటయే పంచాంగ జ్యోతిశ్శాస్త్ర ప్రయోజనముగా తెలియవలెను.

"సర్వేభద్రాణి పశ్యస్తు సర్వేసన్తు నిరామయా సర్వే భవన్తు సుఖిన్ మాకశ్చిత్ దుఃఖబాశ్చివేత్" అంటే అందరికీ మేలు జరగాలని, రోగ రహితులు కావాలి, అందరూ సుఖంగా ఉండాలి. ఎవ్వరూ బాధపడకూడదు అని భావం ఈ వత్సరం పరాభవ నామమైన అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలనే కోరుకుందాం...!!

**సర్వేజనా సుఖినోభవన్తు**



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# "నా మది తలపులో నీవే..." ??



ఒక చిన్న పట్టణంలో ఆదిత్య అనే యువకుడు ఉండేవాడు.
అతనికి కవితలు రాయడం అంటే ఎంతో ఇష్టం...
మనసులోని భావాలను పదాలుగా అల్లుకుని కాగితంపై రాయడం అతని అలవాటు.
ఒక రోజు అతని జీవితంలో నందిని వచ్చింది...
మొదట స్నేహం... తరువాత ఆలోచనలన్నీ ఆమె చుట్టూ తిరిగాయి.
ఆమెను చూసిన ప్రతిసారి
అతని హృదయం కొత్త కవితగా మారేది...
ఒక సాయంత్రం పార్క్‌లో కూర్చొని అతను ఇలా రాశాడు
"నా మది తలపులో నీవే,
నా మది ఊహలో నీవే...
నే నడిచే ప్రతి దారిలో నీవే..."
ఆ కవిత... అతని హృదయం.
ఒక రోజు ధైర్యం చేసి ఆమెకు ఇచ్చాడు...
ఆమె చదివింది... చిన్న నవ్వు మెరిసింది ??
"ఇది నిజమేనా?" అని అడిగింది...
"నా చిన్న ప్రపంచంలో మిగిలింది నీవే..." అని అన్నాడు.
ఆమె కళ్లలో ఆనందం మెరిసింది...
"అయితే ఆ ప్రపంచంలో నేను కూడా నీతోనే ఉంటాను..." ??
ఆ రోజు నుండి అతని కవితలు ఇంకా మధురమయ్యాయి...
ఎందుకంటే
ప్రేమ అంటే... మన హృదయంలో ఎవరో ఒకరు శాశ్వతంగా నివసించడం. ??

రచన: తేరాల రాజేంద్ర ప్రసాద్
కలం: శాంతి
మీసేవ: గిరినగర్, హైదరాబాద్ - 500037
చరవాణి: 9297109223

# మిత్రులారా..! మీకోసం

నాకు అత్యంత ఇష్టమైన
భగవద్గీత 10 వ అధ్యాయము
"విభూది యోగం" క్లుప్తంగా...
(26 నుండి 30 శ్లోకాలు)...(2 భాగం)

శ్రీ కృష్ణ భగవానుడు పలికెను :

ఓ అర్జునా..! ఓ కురు శ్రేష్ఠా..!
ఇప్పుడు నాయొక్క దివ్య విభూతులను
నీకు క్లుప్తంగా వివరిస్తాను శ్రద్ధగా విను.


**10.26**
దేవర్షులలో నారదుడను నేనే
సిద్దులలో కపిల మునిని నేనే
గంధర్వులలో చిత్రరథుడను నేనే
సమస్త వృక్షాల్లో రావిచెట్టును నేనే

**10.27**
మనుష్యులలో ప్రభువును నేనే
అశ్వములలో ఉచ్చైఃశ్రవమును నేనే
భద్రగజములలో ఐరావతమును నేనే

**10.28**
సర్పాలలో వాసుకి నేనే
ఆయుధాలలో వజ్రాయుధాన్ని నేనే
పాడిఆవులలో కామధేనువును నేనే సంతానోత్పత్తికి
కామదేవుడను నేనే

**10.29**
నాగులలో ఆదిశేషుడను నేనే
పితృదేవతల్లో అర్యముడను నేనే
జలదేవతలలో వరుణదేవుడను నేనే
ధర్మశాసకులలో యమధర్మరాజును నేనే

**10.30**
లెక్కించలేని కాలాన్ని నేనే
దైత్యులలో ప్రహ్లాదుడను నేనే
పక్షుల్లో పక్షిరాజైన గరుత్మంతున్ని నేనే
మృగాలలో మృగరాజైన సింహాన్ని నేనే



సేకరణ:-
పోలయ్య కవి కూకట్లపల్లి
అత్తాపూర్....హైదరాబాద్
చరవాణి...9110784502


# పదవ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు

- జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం
- ఎలక్ట్రానిక్ పరికరాలపై కఠిన తనిఖీలు
- ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు చర్యలు
- ట్రాఫిక్ నియంత్రణతో విద్యార్థులకు సౌకర్యం

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా, విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా నిర్వహించేందుకు శ్రీకాకుళం జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.
పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.
విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పరీక్షా నియమాలు కచ్చితంగా పాటించేందుకు అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.
అదేవిధంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనవసర గుమికూడింపును నియంత్రిస్తూ, ట్రాఫిక్ సౌకర్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా పోలీసులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.
పరీక్షలు సాఫీగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా పనిచేస్తోంది.

# ఇటు అనుష్క.. అటు త్రిష.. వీళ్లిద్దరే టాప్






సినిమాల విషయంలో కాదు, పెళ్లి పుకార్ల విషయంలో వీళ్లిద్దరూ టాప్ లో ఉన్నారు. దశాబ్దానికి పైగా ఇద్దరిపై పెళ్లి పుకార్లు వస్తూనే ఉన్నాయి. అవి ఎప్పటికప్పుడు రూమర్లగానే మిగిలిపోతున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ టాప్ లోకి వచ్చారు.
మొన్నటికిమొన్న త్రిష పెళ్లిపై వచ్చిన పుకార్లు అన్నీ ఇన్నీ కావు. ఆమె ఓ సీనియర్ హీరోను పెళ్లాడబోతోందంటూ తెగ ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఏకంగా విజయ్ పేరు తెరపైకొచ్చింది. తమిళ సినిమా మీడియాతో పాటు, కొంతమంది రాజకీయ నాయకులు కూడా విజయ్-త్రిషను లింక్ పెడుతూ మాట్లాడారు. ఈ ఊహాగానాలకు మరింత బలం చేకురూస్తూ, విజయ్ భార్య విడాకులకు అప్లయ్ చేశారు. అయితే ఉన్నంతలో ఇప్పుడు త్రిషపై పెళ్లి పుకార్లు తగ్గాయి. గాసిప్స్ మొత్తం విజయ్ చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో, త్రిషను ఏ బిజినెస్ మేన్ తోనో ముడిపెడుతూ కథనాలు అల్లడం తగ్గింది.
అనుష్క విషయంలో మాత్రం ఇవి ఎప్పటికప్పుడు తెరపైకొస్తూనే ఉన్నాయి. దుబాయ్ కు చెందిన వ్యాపారవేత్తతో వివాహం అంటూ కొన్ని నెలల కిందట అమెపై గాసిప్స్ వచ్చాయి. అవి ఇలా చల్లారాయో లేదో తాజాగా మరోసారి బొమ్మాలి పెళ్లిపై వరుస కథనాలు రావడం మొదలయ్యాయి. ఎప్పట్లానే ఇవి కూడా పుకార్లుగానే మిగిలిపోయాయి. అనుష్క పెళ్లిపై ప్రస్తుతం వినిపిస్తున్న ఊహాగానాలన్నీ అవాస్తవాలంటూ ఆమెకు చెందిన ఇండస్ట్రీ వ్యక్తులు అంటున్నారు.

# ధురంధర్-2 ఎం ఉస్తాద్.. ప్రీమియర్ వార్ తప్పదా?

"రెండు సినిమాలకు అస్సలు పోలికే లేదు. ధురంధర్-2తో మాకు పోటీ లేదు. రెండు సినిమాల జానర్స్ వేరు. ఆడియన్స్ వేరు".. ఇలా ఉస్తాద్ భగత్ సింగ్ యూనిట్ ఎన్ని ప్రకటనలు చేసినా, మారిన సమీకరణాల నేపథ్యంలో, తెలుగు రాష్ట్రాల్లో ఈ 2 సినిమాల మధ్య పోటీ తప్పేలా లేదు.
ధురంధర్-2 సినిమా పెయిడ్ ప్రీమియర్స్ కు అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమై చాన్నాళ్లయింది. పెద్ద సిటీస్ నుంచి మొదలుపెడితే, ఓ మోస్తరు పట్టణాల వరకు ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగాయి. 18వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రీమియర్స్ ప్లాన్ చేశారు.
ఇప్పుడు ఆఖరి నిమిషంలో ఉస్తాద్ రెడీ అయ్యేలా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కరుణిస్తే, 18వ తేదీ రాత్రికి ఉస్తాద్ భగత్ సింగ్ కూడా రెడీ అయిపోతుంది. అదే కనుక జరిగితే ఈ రెండు సినిమాల మధ్య తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యక్షంగా బాక్సాఫీస్ పోరు మొదలైనట్టే.
అయితే ఉస్తాద్ కు ప్రీమియర్స్ కు అనుమతి దక్కితే, ఎన్ని గంటలకు ఆ షోలు ప్రారంభమౌతాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.
ఎందుకంటే, ధురంధర్-2 సినిమా నిడివి ఏకంగా 4 గంటలు. ఈ సినిమాకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రేక్షకులు, అదే రోజు ఉస్తాద్ చూడడం ప్రాక్టికల్ గా సాధ్యం కాకపోవచ్చు. ఈ ప్రాక్టికల్ సమస్యలపై రేపు క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.
ఏపీలో మాత్రం ఈ రెండు సినిమాల ప్రీమియర్స్ కు క్లాష్ లేదు. 18వ తేదీ సాయంత్రం ధురంధర్-2 పెయిడ్ ప్రీమియర్స్ ఉండగా.. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షోలు 19వ తేదీ ఉదయం 4 గంటల నుంచి మొదలవుతున్నాయి. అయితే ఇక్కడ కూడా ప్రాక్టికల్ గా ఓ సమస్య ఉంది. 18న ధురంధర్-2 చూసి, 19న పొద్దున్నే ఉస్తాద్ చూడడం ఇబ్బంది.





## డ్రగ్స్ కేసు: ఎంపీ పుట్టా మహేష్‌పై
# జేడీయూ ఆగ్రహం

- మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసులో స్టేషన్ బెయిల్‌పై అభ్యంతరం
- ఎన్డీఏ హస్తం ఉందని ఆరోపణలు
- చర్యలు లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాల హెచ్చరిక

**నవతరం-శ్రీకాకుళం**



ఏలూరు పార్లమెంట్ సభ్యుడు (టీడీపీ) పుట్టా మహేష్ కుమార్‌పై నమోదైన డ్రగ్స్ కేసు నేపథ్యంలో ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని యునైటెడ్ జనతాదల్ (జేడీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతి నాయుడు డిమాండ్ చేశారు.
తెలంగాణలోని మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఈగల్ బృందం ఎస్పీ గిరిధర్ అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు సమాచారం ఉన్నప్పటికీ, కోర్టులో ప్రవేశపెట్టకుండా స్టేషన్ బెయిల్ ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. డ్రగ్స్ కేసులో ఇతరులను మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తూ, ఎంపీకి మాత్రం మినహాయింపు ఇవ్వడం వెనుక ఎన్డీఏ ప్రభుత్వం నాయకుల హస్తం ఉందని కరణం తిరుపతి నాయుడు ఆరోపించారు. టీడీపీ పార్టీ షోకాజ్ నోటీసులతో మాత్రమే సరిపెట్టకుండా, సభ్యత్వాన్ని రద్దు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

---

## బూర్జలో దివ్యాంగు సోదరులకు
# ఉచిత బస్సు ప్రయాణం




**నవతరం-ఆమదాలవలస**

ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ మండలం ఈరోజు ఒక మంచి కార్యక్రమానికి వేదికగా మారింది,రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకానికి బూర్జ లో ఘనంగా శ్రీకారం చుట్టారు.
ఈ కార్యక్రమంలో ఆముదాలవలస గౌరవ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని పచ్చ జెండా ఊపి బస్సును ప్రారంభించారు.
ఈ ప్రారంభోత్సవం కేవలం ఒక పథకం ప్రారంభం మాత్రమే కాకుండా, దివ్యాంగుల జీవితాల్లో ఒక కొత్త ఆశాకిరణంగా నిలిచింది.
ఇకపై వారు విద్య, వైద్యం, ఉపాధి వంటి అవసరాల కోసం ఎలాంటి ఆర్థిక భారం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా సులభంగా ప్రయాణం చేయవచ్చు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ గారు మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా దివ్యాంగులు ఇకపై తమ రోజువారీ అవసరాలను సులభంగా తీర్చుకోగలరని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.
అంతేకాకుండా, ఈ పథకం ద్వారా దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెరిగి, వారు సమాజంలో మరింత చురుకుగా పాల్గొనే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.
ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రతి అర్హుడు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు. పథకం ప్రారంభంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.
"ఇప్పటివరకు ప్రయాణ ఖర్చులు మా కోసం ఒక పెద్ద భారంగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మా జీవితాలను సులభతరం చేస్తుంది" అని పలువురు దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వానికి సీఎం గారికి ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక నాయకులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ పథకం అమలు సక్రమంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.
దివ్యాంగులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రయాణించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.మొత్తంగా బూర్జలో జరిగిన ఈ ఉచిత బస్సు ప్రయాణ ప్రారంభోత్సవం దివ్యాంగుల సంక్షేమంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది.
ఈ సందర్భంగా 300 దివ్యాంగులకు భోజన సదుపాయశీ ఎమ్మెల్యే గారు కల్పించారు.
ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు ఎం రమేష్ గారు, ాజ ణవీ,ణ=ణూా్ాణ, మాజీ ఎమ్మెల్సీ పి విశ్వ ప్రసాద్ గారు మార్కెట్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ గారు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

---

# జీవనశైలితో కిడ్నీ కుదేల్!

- రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు.
- ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రిలలో కూడా డయాలసిస్ సేవలు
- బీపి,షుగర్ తోనే కిడ్నీకి ఇబ్బంది.
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు
- రోగులకు అందుబాటులో ఆధునిక వైద్యం
- విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్ వాడకం ప్రమాదకరం





**డాక్టర్ ఉలాల కోదండ రామ్**
అసిస్టెంట్ ప్రొఫెసర్(కేజీహెచ్),
మహాలక్ష్మి నర్సింగ్ హోమ్,
ఇచ్చాపురం.

**నవతరం-పలాస**

కిడ్నీ..మానవ శరీరంలో అతి ముఖ్యమైన అవయవం.తినే తిండి,తాగే నీటిని వడగట్టి .. వడబోసి..శరీరానికి అవసరమైన శక్తిని రక్తంలోకి, మలినాలను, వ్యర్థాలను మల మూత్ర విసర్జన ద్వారా బయటికి పంపించే ప్రక్రియను కిడ్నీ నిర్వహిస్తుంది. మన శరీరంలో కిడ్నీలు ఎంతో కీలకం. చిక్కుడు గింజ ఆకారంలో ఉండే కిడ్నీలు ప్రతిరోజు నిరంతరం రక్తాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. ఆధునిక జీవనశైలికి అలవాటు పడడంతో కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి పదిమందిలో ఒకరు ఏదో ఒక కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2006 నుంచి ప్రతి ఏడాది మార్చి నెల రెండు గురువారం వరల్డ్ కిడ్నీ డే ని నిర్వహిస్తున్నారు. కిడ్నీలు ప్రతిరోజు దేహంలో 200 లీటర్ల రక్తాన్ని శుభపరుస్తూ, యూరియా, క్రియేటినిన్ లాంటి జీవ రసాయనాలను వడపోస్తాయి. కిడ్నీల పనితీరు దాదాపు 70 నుంచి 80 శాతానికి పడిపోయే వరకు బాధితులకు ఆ విషయమే తెలియదు. ఒకసారి కిడ్నీలు కనుక చెడిపోతే, జీవ క్రియల్లో వెలువడే ఎన్నో విష రసాయనాలు దేహంలోనే పేరుకుపోవడం మొదలవుతుంది. దీంతో ప్రాణాలకే ముప్పు తెచ్చి పెడుతుంది. అవగాహన లేమి, నిర్లక్ష్యశీ, విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్ మందులు వాడడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. అంతేగాక జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్య రుగ్మతలు కిడ్నీ వ్యాధులకు కారణం కావచ్చు. చాలామంది వ్యాధి ముదిరే వరకు కిడ్నీ వ్యాధి లక్షణాలు తెలియకపోవడం వల్ల వాళ్ల పరిస్థితి విషమించిన తర్వాత వైద్యానికి వెళ్తున్నారు. తగ్గని జ్వరం, కాళ్లు, ముఖం వాపులు, యూరిన్ లో ప్రోటీన్లు పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కిడ్నీ వ్యాధికి సంబంధించిన ప్రమాద కారణాలు మధుమేహం ( షుగర్ ), రక్తపోటు ( బీపీ ) కుటుంబంలో మూత్రపిండాల వ్యాధి చరిత్ర కొంతమందికి లేకపోలేదు. మూత్రపిండాలు మూత్రం తయారీ తో పాటు రక్తం వడపోతలో కీలకంగా పని చేస్తాయి. కణాలు ఉత్పత్తి చేసే ఆమ్లాలను ( యాసిడ్ )ను బయటికి పంపిస్తాయి. రక్తంలో నీరు, లవణాలు, సోడియం, కాల్షియం, భాస్వరం, పొటాషియం వంటివి సమతుల్యంగా ఉండేలా చేస్తాయి. కిడ్నీలు దెబ్బ తింటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. సీరం క్రియేటిన్ పరీక్ష ద్వారా కిడ్నీ పనితీరును తెలుసుకునే వీలుంటుంది. సంవత్సరానికి ఒక్కసారైనా ఈ పరీక్ష చేయించుకోవాలి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి , రక్తపోటు, మధుమేహం, అధిక బరువు వంటివి తలెత్తకుండా చూసుకోవాలి. ధూమపానం, మద్యపానం మానుకోవాలి. పుష్కలంగా మంచినీరు తాగాలి. వ్యాయామం చేయాలి. ఉప్పు తక్కువ తీసుకోవాలి. అధికంగామాంసం తీసుకోవద్దు. ఆహారంలో సగభాగం పీచు పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. నొప్పి మాత్రలు, అనవసరంగా స్టెరాయిడ్ వాడకూడదు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం ప్రాంతం కిడ్నీ వ్యాధి మహమ్మారి కి మూడు దశాబ్దాలలో వేలాదిమంది అకాల మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో కొందరు మేధావులు, కొన్ని ప్రజా సంఘాలు కొనసాగించిన పోరాటంలో భాగంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పలాసలో వైయస్సార్ కిడ్నీ రీసెర్చ్ కేంద్రం సుమారు 70 కోట్ల రూపాయలు ఖర్చుతో నిర్మించారు. ఈ కిడ్నీ వ్యాధి సోకినట్లు ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే వ్యాధి మొదట ముందే మందులతో పాటు జీవన శైలి, ఆహారపు అలవాటులతో నియంత్రించవచ్చు.

---

# ఉగాది ప్రజలకు శుభాలు కలగాలి

## ప్రజలకు డాక్టర్ నిమ్మానదాస్ ఉగాది శుభాకాంక్షలు

**నవతరం-సోంపేట**




తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజానీకానికి వైయస్సార్సీపి సీనియర్ నేత, సోంపేట ఎంపీపీ డాక్టర్. నిమ్మాన దాస్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది పండుగ ప్రజల జీవితాల్లో అంతులేని ఆనందం తీసుకురావాలని, అన్ని వర్గాల ప్రజలు, రైతాంగం, కార్మికులు, యువత, మహిళలు, పిల్లలు ఈ ఏడాదంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు పడితే అన్నదాతలు సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుని కి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.
ఉగాది పర్వదినంలో పల్లెలు, పట్టణాలలో పండగ వాతావరణంతో కళకళలాడాలని, సకల వృత్తులు పరిఢవిల్లాలని, ప్రతి ఇంటిలో షడ్రుచుల ఉగాది ఆనందం ఐశ్వర్యం తీసుకురావాలని అభిలాషించారు.
తనకు ప్రాణ సమానమైన వైయస్సార్సీపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తో పాటు వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు, జిల్లా మరియు నియోజకవర్గ స్థాయి నేతలు, కార్యకర్తలు, అభిమాను లతోపాటు ప్రజలందరికీ డాక్టర్ నిమ్మాన దాస్ ప్రత్యేకంగా ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

---

## అసభ్యంగా ప్రవర్తిస్తే
# గట్టిగా ఎదిరించాలి

### విద్యార్థులకు 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'పై అవగాహన
### సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. హరిబాబు



**నవతరం-శ్రీకాకుళం**

బాలల భద్రత కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్సా) రూపొందించిన 'స్నేహపూర్వక న్యాయ సేవలు' వారి రక్షణకు ఎంతగానో దోహదపడతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని ఆర్‌సీఎం సెయింట్ జాన్స్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంధువులు, స్నేహితులు లేదా ప్రయాణాల్లో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, శరీర భాగాలపై అనుచితంగా చేతులు వేసినా భయపడకుండా వెంటనే 'వద్దు' అని గట్టిగా చెప్పాలని హితవు పలికారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.
ఆపదలో ఉన్నప్పుడు లేదా వేధింపులకు గురైనప్పుడు విద్యార్థులు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీసు 100 లేదా ఉచిత న్యాయ సేవల నంబర్ 15100కు సమాచారం అందించాలని హరిబాబు సూచించారు. పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, సిస్టర్ జ్యోత్స్న, టి. సుమంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**